క్లుప్తంగా

పత్తిపంట పరిశీలన


జగిర్యాలలో పంటను పరిశీలిస్తున్న ఏఓ జావిద్

రేగోడ్(మెదక్): మండలంలోని రేగోడ్, జగిర్యాల గ్రామాల్లో బుధవారం ఏఓ జావిద్ పత్తి పంటను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పంటనష్టంపై రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటనష్టం ఏమీ జరగలేదని తెలిపారు.

ఓటర్ జాబితాపై బీఎల్ఓలకు అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): ఓటరు జాబితాపై బీఎల్ఓలకు బుధవారం పేటలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్స్ నర్సింలు, భూమయ్యలు 41 మంది బీఎల్ఓలకు నూతనంగా వచ్చిన బీఎల్ఓ యాప్‌లో వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరణప్ప, ఆయా గ్రామాల బీఎల్ఓలున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


మెదక్‌జోన్: మండలంలోని ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ రజిని మామ గుజ్జరి పుండరీకం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బుధవారం సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మెదక్ ఎంపీపీ యమున, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మంభోజిపల్లి గ్రామ సర్పంచ్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, రాములు, నవీన్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు


భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా సొంత భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేట, రత్నపూర్ గ్రామాల్లో బస్తీ దవాఖానాల ఏర్పాటు కోసం స్థలాల ఎంపిక చేశారు. శివ్వంపేటలో రెండు గుంటల గ్రామ కంఠం భూమితో పాటు రత్నపూర్‌లో మూడు గుంటల భూమి ఎంపిక చేసినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన వివరాలు సంబంధిత వైద్య సిబ్బందికి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఆర్ఐ కిషన్, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఆరోగ్య సిబ్బంది చందర్, దిగంబర్, సర్వేయర్ ఉన్నారు.

గిరిజనుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): తాత, ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ పట్టాలు పొందిన భూముల్లోకి రానివ్వకుండా అటవీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని గిరిజనులు బుధవారం ఆందోళన చేశారు. మండల పరిధిలోని బోజ్యా పంచాయతీ హరిదాస్ తండాలో పలువురు గిరిజన రైతులకు సర్వే నంబర్ 70లో 9 ఎకరాల 35 గుంటల భూమి సాగు చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా వచ్చాయి. ఇందులో 4 ఎకరాల అటవీ భూమి ఉందని ఇందులో పంటలు వేయొద్దని అటవీ సిబ్బంది వేధిస్తున్నారని వాపోయారు. ఈ విషయం గురించి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, సర్వేయర్ వచ్చి మా భూమి హద్దులు చూపించినప్పటికీ అటవీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మా భూమిలోకి వెళ్తే కేసులు నమోదు చేశారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, భూ సమస్య పరిష్కరించాలని కోరారు.

నాగేశ్వర్‌రావు ఎంపికపై హర్షం

శివ్వంపేట(నర్సాపూర్): మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా దంతన్‌పల్లికి చెందిన ములుగు నాగేశ్వర్‌రావు ఎంపిక కావడంపై బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛతవైపు అడుగులు

- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- చెత్త సేకరణకు ఆటోలు, ట్రాక్టర్ల ఏర్పాటు

నర్సాపూర్: పల్లెలు, పట్టణాల్లో తడి, పొడి చెత్త సేకరణ విజయవంతంగా కొనసాగుతోంది. దీంతో పల్లెలు, పట్టణాలు పచ్చని పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నర్సాపూర్‌లో పకడ్బందీగా అమలు చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఏడాదికి ఒకసారి అవార్డుల అందజేత

కేంద్ర ప్రభుత్వం 2018 సంవత్సరంలో స్వచ్ఛభారత్ అభియాన్ పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఏడాదికి ఒకసారి కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం ఆయా పట్టణాల్లో, గ్రామాల్లో పర్యటించి పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న పట్టణాలకు, గ్రామ పంచాయతీలకు అవార్డులను అందజేస్తుంది.

- నర్సాపూర్ పట్టణంలో 15 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల్లో కలిపి సుమారు 7 వేల కుటుంబాలు ఉన్నాయి.
- 15వార్డుల్లో చెత్త సేకరించేందుకు మున్సిపాలిటీలో ఎనిమిది ఆటోలు, రెండు ట్రాక్టర్లతో పాటు తగిన సిబ్బంది ఉన్నారు. ఆయా వాహనాల ద్వారా రోజు ఉదయం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. బహిరంగ మల మూత్ర విసర్జన చేయకుండా అందుకు అవసరమైన మూత్రశాలలు నిర్మించాల్సి ఉంటుంది. అందులో భాగంగా కొన్ని వినియోగంలో ఉండగా మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి.
- ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయాల్సి ఉండగా 120 మైక్రాన్స్ ప్లాస్టిక్ కవర్లనే వాడాలన్న నిబంధనలను అమలు చేస్తున్నారు. అందుకు వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లఘించిన వారికి జరిమానా వేస్తున్నారు.
- స్వచ్ఛ పట్టణంగా తయారు చేసే క్రమంలో భాగంగా వీధి మూలల వద్ద, మురికి కాల్వల పక్కన, ఎక్కడ పడితే అక్కడ చెత్త పారేయకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- తడి, పొడి, హానికర చెత్త సేకరణపై కళాబృందాలతో పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే మెప్మా సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి మహిళలకు చెత్తను వేరు చేసి ఇవ్వాలని వారిలో చైతన్యం కల్గిస్తున్నారు.
- పట్టణంలోని 13 వార్డుల్లో చెత్త బుట్టలను పంపిణీ చేశారు. బ్లూ రంగు ప్లాస్టిక్ బుట్టలో పొడి, ఎరుపు రంగు బుట్టలో హానికర, ఆకుపచ్చ బుట్టలో తడి చెత్త కోసం వినియోగించాలన్నారు.
- తడి చెత్తను ప్రతీరోజు సేకరిస్తామని, పొడి చెత్తను, హానికర చెత్తను ప్రతీ మంగళ, శుక్రవారాల్లో సేకరిస్తామని మున్సిపాలిటీ సిబ్బంది తెలిపారు.
- డంపింగ్ యార్డు నిర్మాణం చివరి దశకు వచ్చినందున అది పూర్తయ్యే లోపు ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌గోపాల్, అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగు విద్యార్థులకు కాలేజీలో కలెక్టర్ రాజర్షిషా స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని, పట్టణంలో, గ్రామంలో ఈ కార్యక్రమం అమలుతో పాటు మీ సలహాలను యాప్‌లో ప్రభుత్వానికి తెలుపాలని ఆయన విద్యార్థులకు వివరించారు.

స్వచ్ఛ పట్టణం దిశగా కృషి



నర్సాపూర్ పట్టణాన్ని కలెక్టర్ రాజర్షిషా, మున్సిపాలిటీ పాలకమండలి సహకారంతో స్వచ్ఛపట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలో సేకరించిన తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీని ప్రారంభిస్తాం.

– వెంకట్‌గోపాల్, మున్సిపల్ కమిషనర్

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యం

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు బుధవారం నాటికి 115 రోజులకు చేరుకున్నాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు ఆందోళన విరమించమని, ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. దీక్షలకు వ్యాపార సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలు తమ మద్దతు ప్రకటించాయి.

దరఖాస్తు చేసుకోండి

చిన్నశంకరంపేట(మెదక్): దివ్యాంగుల ధ్రువీకరణకు జులై నెలలో నిర్వహించే సదరం క్యాంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సదరం క్యాంపుకు హాజరు కావాలనుకునే దివ్యాంగులు మీ సేవకేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తును అందించి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పత్రంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటో, మెడికల్ రిపోర్ట్, మీ సేవ రశీదు సాఫ్ట్ కాపీని అందించాలని కోరారు. స్లాట్‌బుక్ చేసుకున్న రోజు ఉదయం 9 నుంచి 12 మధ్యన జిల్లా కేంద్రంలో హాజరుకావాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్‌లను విధుల్లోకి తీసుకోవాలి

పాపన్నపేట(మెదక్): గెస్ట్ లెక్చరర్‌లనే విధుల్లోకి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి అన్నారు. పాపన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కళాశాలల్లో పనిచేసిన గెస్ట్ లెక్చరర్‌లకే ప్రస్తుత విద్యాసంవత్సరం అవకాశం కల్పించాలని మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ వేయాల్సిన అవసరం లేదన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు


నర్సాపూర్: చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్‌గోపాల్

నర్సాపూర్: వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. బుధవారం ఉదయం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ పర్యటించి చెత్త సేకరణతో పాటు వర్షంతో రోడ్లపైకి వచ్చే చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున మురికి కాల్వల్లో చెత్త చెదారం నిండకుండా మురికి కాల్వలను శుభ్రం చేయించామని అన్నారు. పారిశుధ్య సిబ్బందికి వర్షాలు కురిసినప్పుడు ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన పనులపై సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. కాగా వర్షం నీరు నిల్వ ఉండకుండా పట్టణ ప్రజలు తమతో సహకరించాలని కోరారు. తమ ఇళ్ల పక్కన గుంతలుంటే పూడ్చాలని, నీరు నిల్వ ఉండకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో పారిశుద్ధ్యం చర్యలు చేపట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. విధులపై అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ నార్సింగి

రామాయంపేట(మెదక్): భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన నార్సింగిలో మాట్లాడుతూ.. వాతావరణశాఖ చెప్పిన ప్రకారం మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దని, నీటి ప్రవాహం దాటొద్దని సూచించారు. వర్షానికి కరెంట్ షాక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉండటంతో రైతులు తమ వ్యవసాయ బోర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లలో చిన్నపిల్లలు, పెద్దలు కరెంట్ దూరంగా ఉండాలని, కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. పురాతన ఇళ్లు కూలిపోయే అవకాశం ఉందని, ఈ విషయమై గ్రామాల్లో సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని చైతన్య పర్చాలని తెలిలిరు. ఏదైనా ప్రమాదం వాటిల్లితే వెంటనే సమీపంలో పోలీస్‌స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్‌లో సమాచారం అందజేయాలన్నారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌ను కలిసిన చేగుంట నాయకులు


రేవంత్‌రెడ్డితో చేగుంట నాయకులు

చేగుంట(తూప్రాన్): నూతనంగా ఎన్నికైన దుబ్బాక నియోజకవర్గ మండలాధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డితో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ తెలిపారు. ఇటీవల దుబ్బాక నియోజకవర్గంలోని 8 మండలాలకు మండల శాఖ నూతన అధ్యక్షులను నియమించగా మర్యాద పూర్వకంగా రేవంత్‌రెడ్డిని కలిసినట్లు ఆయన పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింలు ఉన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఉత్పత్తికి రుణం

చేగుంట(తూప్రాన్): సోలార్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు మహిళా సంఘాలకు లక్ష రూపాయల రుణం అందించేందుకు ప్రతిపాదనలు తయారు చేశామని శ్రీనిధి రీజనల్ మేనేజర్ గంగారాం అన్నారు. చేగుంటలో బుధవారం మహిళా సంఘాల సీసీలతో శ్రీనిధి బ్యాంకు ఆర్ఎం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ లాలూనాయక్, ఏపీఎం లక్ష్మీనర్సమ్మతో పాటు ఆయా గ్రామాల సీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


కౌడిపల్లి(నర్సాపూర్): సమ్మె చేస్తున్న కార్మికులు

కౌడిపల్లి(నర్సాపూర్): జీపీ కార్మికుల సమ్మె వర్షంలోను కొనసాగుతోంది. బుధవారం ఓవైపు వర్షం పడుతున్న కార్మికులు సమ్మె చేస్తున్నారు. కౌడిపల్లిలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె 14వ రోజుకు చేరింది. జీపీ కార్మికులు సంఘం అధ్యక్షుడు ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో వర్షంలోనూ సమ్మె చేస్తున్న వారిలో జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఆసిఫ్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

దారిని పునరుద్ధరించాలి


దారికి అడ్డంగా వేసిన రాళ్లను చూపుతున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): ఏళ్ల నుంచి ఉన్నదారిని రాత్రికి రాత్రి మూసేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో డబుల్‌బెడ్రూం ఇళ్లకు వెళ్లే దారిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాళ్లకుప్పను అడ్డపెట్టి దారిని మూసేశాడు. ఇక్కడ కొన్నేళ్లుగా ఉన్న పురాతన అర్చి నుంచి గ్రామంలోకి దారి ఉండేది. గతంలో కూడా ఈ విషయంపై వివాదం ఉంది. తన పొలం నుంచి ఈ దారి ఉందని తాను అర్చిని తొలగించి దారిని మూసేస్తానని ఓ వ్యక్తి సిద్ధపడగా, గ్రామస్తులు అడ్డుకున్నారు. తాజాగా మూడు రోజుల క్రితం రాత్రికి రాత్రే జేసీబీ సహాయంతో పురాతన అర్చిని తొలగించి రాళ్లను దారికి అడ్డంగా పెట్టాడని గ్రామస్తులు తెలిపారు. నూతనంగా డబుల్‌బెడ్రూం ఇళ్లకు, గ్రామంలోకి రాకపోలకలకు ఈ దారి ఉందని, దీన్ని మూసేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ


బస్‌పాస్‌లు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: మండలంలోని ఘనపూర్ ప్రభుత్వం పాఠశాలల్లో పేద విద్యార్థుల సౌకర్యార్థం బస్‌పాస్‌లను రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. మెడ్చేల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును విద్యార్థుల కోసం గ్రామానికి ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బస్ పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్లు యాదగిరి, నర్సింలు, వెంకటేశ్, నాయకులు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రాకపోకలు బంద్


బాపనయ్య, పన్యా తండాల మధ్య ప్రవహిస్తున్న వాగు

రామాయంపేట(మెదక్): భారీ వర్షాలతో వాగులు, వంకలు నీటితో పోటెత్తుతున్నాయి. దీనితో కొన్ని మారుమూల గ్రామాలు, తండాలకు వెళ్లే రోడ్డు పాక్షికంగా శిథిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని బాపనయ్య తండా, పన్యా తండా మధ్య రోడ్డుపై ఉన్న వాగులో నీరు పోటెత్తడంతో ఈ దారిలో ప్రయాణాలు ఆగిపోయాయి. కాట్రియాల పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అటవీప్రాంతం నుంచి వస్తు వరదనీరు పుష్పాలవాగులో కలవడంతో వరద నీరు పోటెత్తింది.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురు వర్షంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు గ్రామాల్లో ఓ మోస్తారు వర్షాలు కురిసాయి. మండలంలో 4.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఆయా గ్రామాల్లోని పొలాల్లో జలకళ సంతరించుకుంది. వర్షాలతో జాగ్రతగా ఉండాలని పోలీసు శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఊపందుకున్న సాగు పనులు


కౌడిపల్లి(నర్సాపూర్): ధర్మాసాగర్‌లో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని రోజులుగా వర్షాలు కురవక పోవడంతో వరి నాట్లువేసేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. కాగా రెండు రోజులుగా ముసురు వర్షంతో పాటు మధ్య మధ్యలో వర్షం జల్లులు కురుస్తుండటంతో పంట పొలాల్లోనికి నీరు చేరుతుంది. దీంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. ఎకరం వరి నాటు వేసేందుకు కూలీలు రూ 4.500 నుంచి రూ. 5వేల వరకు గుత్తగా తీసుకుంటున్నారు. స్థానిక కూలీలతో పాటు బీహారం, యూపీ కూలీలు సైతం వరినాట్లు వేసే పనులు చేస్తున్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 41.6 ఎం.ఎంల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు బుధవారం తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తమ వ్యవసాయ పనులను ముమ్మురం చేశారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో 10 మీ.మీ వర్షంపాతం నమోదు అయిందని మండల గణాంకాల శాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని తిప్పన్నగుల్ల నుంచి బచ్చురాజ్‌పల్లికి వెళ్లే దారి పూర్తిగా బురదమయం అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బచ్చురాజ్‌పల్లి నుంచి తిప్పన్నగుల్ల వెళ్లే రోడ్డులో కాళేశ్వరం కాల్వ కోసం తీసిన పనులతో మట్టి రోడ్లపైకి వచ్చి రోడ్లు బురదమయంగా మారాయి.

సంక్షిప్త వార్తలు

◆ అండగా ఉంటాం

శివ్వంపే(నర్సాపూర్): పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా ఉంటామని ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన గుమ్మడి బాబు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ దశరథ్, ఉప సర్పంచ్ భిక్షపతిరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

◆ చెక్కుల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన పలువురికి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నవీన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేశం, పోచయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

◆ బంజారాలకు పదవులు ఇవ్వరా?



రేగోడ్(మెదక్): రాజకీయ పార్టీల్లో బంజారాలకు రాష్ట్ర స్థాయి పదవులు ఎందుకు ఇవ్వరని కొండాపూర్ ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్ ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేసిన బంజారా గిరిజన జాతికి రాష్ట్ర స్థాయి పదవుల్లో చిన్నచూపు చూశారన్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లు అయినా.. ఇంకా వారికి గుర్తింపు ఇవ్వడం లేదని తెలిపారు. గిరిజనుల సమస్యల కోసం, తండాల గ్రామ పంచాయతీలు, రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిన నాయకులను అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

◆ ఆధార్ శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని నవాబుపేటలో ఆధార్ అప్డేట్ నమోదు శిబిరం బుధవారం ప్రారంభించారు. 2010 నుంచి 2016 వరకు ఆధార్ పొందిన వారందరు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ కీలక ప్రకటన చేయడంతో కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలతో గ్రామాల్లో ఆధార్ అప్డేట్ కోసం శిబిరాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం వరకు నవాబుపేటలో క్యాంపు జరుగుతుందని, 24 నుంచి 26 వరకు గూడూర్ గ్రామంలో ఆధార్ అప్డేట్ కోసం క్యాంపు జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శివ్వంపేట మీసేవ కేంద్రం నిర్వాహకుడు భానుచారి తెలిపారు. సూచించారు.

◆ చలో ఎస్పీడీను జయప్రదం చేయండి

మెదక్ కలెక్టరేట్: కేజీబీవీ అండ్ యూఆర్ఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల సాధనకై చలో ఎస్ పీడీ ఆఫీస్‌ను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు పిలుపునిచ్చారు. బుధవారం యూఆర్ఎస్‌జీబీవీ పాఠశాలను మధ్యాన భోజన విరామ సమయంలో సందర్శించారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలని, వీక్లీ ఆఫ్ ఇవ్వాలని కోరుతూ జూలై 20న హైదరాబాదులోని ఎస్పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నా. కార్యక్రమంలో శ్రీశైలం, పూర్ణేశ్, లక్ష్య, విజయరావు, పోచయ్య పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం అచ్చంపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందికి వివిధ రకాల శస్త్ర చికిత్సలు చేయాలని, వారికి తమ ఆస్పత్రిలో సోమవారం ఉచితంగా చికిత్సలు చేస్తామన్నారు. రవాణా ఖర్చులు కూడా తామే భరిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డా.నిఖిత, డా. సృజన్, డా. ఇమ్రాన్ , సిబ్బంది ఉన్నారు.